
హాలియా ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

# భగత్ గెలుపుతోనే సాగర్‌కు మరింత మేలు

## 80 వేల మెజార్టీతో గెలిపించాలి

**ఏడెనిమిది నెలల్లో నెల్లికల్లు లిఫ్ట్ పూర్తి**
**నేనే స్వయంగా వచ్చి లిఫ్ట్ ప్రారంభిస్తా**
**నీటి తీరువా రద్దు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే**
**సాగర్‌లో మిగిలి ఉన్న పనులన్నింటికీ నాదే బాధ్యత**
**హాలియా ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్**

నల్లగొండ ప్రతినిధి, నవంబర్14(నమస్తే తెలంగాణ) : హాలియా పట్టణ సమీపంలోని అనుములలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అధ్యక్షతన ప్రజా ఆశీర్వాద సభ జరిగింది. ఈ సభకు ప్రతి గ్రామం, తండా నుంచి జనం తరలివచ్చి తమ అభిమాన నేత, అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. దాంతో హాలియాకు వచ్చే దారులన్నీ సభకు వచ్చే వాహనాలతో కిక్కిరిసిపోయాయి. గులాబీ సైన్యం సభకు బారులు తీరింది. అధినేత కేసీఆర్ సభా వేదికపైకి వచ్చే సరికి సభా ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. భారీ ఎత్తున తరలివచ్చిన ఆశేష జనావాహినిని ఉద్దేశించి సీఎం కేసీఆర్ 25 నిమిషాలపాటు ప్రసంగించారు. ప్రసంగం ఆద్యంతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరణతోపాటు విపక్షాలపై పంచ్‌లు, సాగర్ అభివృద్ధి, జానారెడ్డి వైఫల్యాలపై కొనసాగడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రసంగం మధ్యలో అనేక సార్లు చప్పట్లు, ఈలలు, అరుపులు, కేరింతలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఓటు అనేది మీ తలరాతను మారుస్తది. వచ్చే ఐదేండ్లు ఎవరు పాలించాలి? ఎవరి చేతుల్లో ఈ రాష్ట్రం ఉంటే క్షేమంగా ఉంటది? పార్టీలు ఏంటి? ఏ పార్టీ చరిత్ర ఏమిటి? ఎవరి చేతికి అధికారం ఇస్తే ఏం చేశారు? ఇవన్నీ ఆలోచించాలి, గ్రామాల్లో చర్చ పెట్టాలి అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'మీ అందరికీ తెలుసు.. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం.. తెలంగాణ ప్రజల హక్కుల కోసం.. రాష్ట్రం సాధించడం కోసం.. కానీ, కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లుగా ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని పరిపాలించిన పార్టీ.. బీఆర్ఎస్ పదేండ్లు పాలించింది.. మరి ఎవరి కాలంలో ఏం జరిగింది అనేది మీరంతా గ్రహించాలి' అని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ధైర్యంతో పనిచేసి పేదలను ఆదుకోలేదలేదన్నారు. సాగర్‌లో ఎన్నోసార్లు గెలిపించిన జానారెడ్డి మంత్రిగా, ప్రతిపక్ష నేతగా పని చేసినా ఇక్కడ చేసిందేమిటో ఆలోచించాలన్నారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే సరికి సాగర్‌కు సరిగ్గా నీళ్లే రాకపోయేవని గుర్తు చేశారు.

### నేనే వచ్చి నెల్లికల్ లిఫ్ట్‌ను ప్రారంభిస్తా..

నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తానే స్వయంగా వచ్చి ప్రారంభిస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించారు. 'భగత్ ఎమ్మెల్యే అయ్యాకనే రెండు లిఫ్ట్‌లు కావాలంటే ఒకటి స్టార్ అయ్యింది. నెల్లికల్ లిఫ్ట్ మాత్రం తొలుత ఐదు వేల ఎకరాలకే ఉంటే దాని రీ డిజైన్ చేసి 25 వేల ఎకరాలకు పెంచి పనులు చేపట్టాం. రాబోయే ఏడెనిమిది నెలల్లో నెల్లికల్ లిఫ్ట్‌ను పూర్తి చేస్తాం. నేనే స్వయంగా వచ్చి ప్రారంభిస్తా' అని కేసీఆర్ స్పష్టం చేశారు. సాగర్ ఆయకట్టులో కాంగ్రెస్ హయాంలో ముక్కుపిండి వసూలు చేసే నీటి తీరువాను బీఆర్ఎస్ సర్కారు వచ్చాకే రద్దు చేసి రైతుల కష్టాలు తీర్చినట్లు గుర్తు చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు వద్దని, పీసీసీ అధ్యక్షుడు 3 గంటల కరెంటు చాలని, రాహుల్‌గాంధీ ధరణి తీసేస్తానని అంటున్నారని తెలిపారు. ఇవన్నీ ఉండాలా? వద్దా? అని ప్రజలను ప్రశ్నించగా అన్నీ యథావిధిగా ఉండాలని సభా ప్రాంగణం చప్పట్లతో సమ్మతి తెలిపింది.

### కరెంటుపై మాట తప్పిన జానారెడ్డి..

రెండేండ్లలో రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తామని ఆనాడు అసెంబ్లీలో ప్రకటన చేశా. జానారెడ్డి అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్నాడు. ఆయన లేచి ఒక మాట చెప్పిండు. కేసీఆర్ గారూ మీరు రెండేండ్లలో కాదు, నాలుగేండ్లలో 24 గంటల కరెంటు ఇచ్చినా.. నేను కాంగ్రెస్ కండువా తీసేసి గులాబీ కండువా మెడలో వేసుకుని కార్యకర్తలా పని చేస్తానని చెప్పిండు. వాస్తవానికి 24 గంటలు ఇచ్చి నేను సక్సెస్ అయ్యా. జానారెడ్డి మాత్రం మాట మీద నిలువలేదన్నారు. పైగా ఆయన ఉప ఎన్నికల్లో భగత్ మీద నిలబడితే మీరే బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ఆయన వైఖరి ఏమిటో అర్థం చేసుకుని భగత్‌ను గెలిపించి సాగర్‌ను మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.


హాలియాలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జన సందోహం

### బీఆర్ఎస్‌తోనే మరింత సంక్షేమం

బీఆర్ఎస్‌తోనే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు సాధ్యమని కేసీఆర్ చెప్పారు. మీరు భగత్‌ను గెలిపిస్తే రైతుబంధు రూ.16వేలకు, పింఛన్ 5వేలకు, తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, మహిళలకు నెలకు 3 వేల భృతి, ప్రతి ఇంటికీ కేసీఆర్ భీమా.. ఇలా అనేక మంచి పనులు జరుగుతాయి అని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలంతా గ్రామాల్లో చర్చ పెట్టాలి. ఏదీ రాయో, ఏదీ రత్నమో గుర్తించేలా ప్రజలకు వివరించాలి. ఇట్లా చర్చ చేస్తే నోముల భగత్ 70 నుంచి 80 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తాడు. భగత్‌ను గెలిపిస్తే ఆయన అడిగిన పనులన్నీ పూర్తిచేసే బాధ్యత నాది అని సీఎం హామీ ఇచ్చారు. నాగార్జునసాగర్‌లో మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పొరపాటున కాంగ్రెస్ వస్తే కరెంటు పోవుడు ఖాయం.. రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీం.. ఎవ్వరూ ఎక్కడ పోతరో తెల్వదు. కాంగ్రెసోళ్ల చేతులకు రాజ్యం పోతే వైకుంఠ ఆట మాదిరిగా మల్ల పెద్దపాము మింగి కిందికి వచ్చినట్లయితది. అందుకే ఆలోచించి ఓటు వేయండి. బీఆర్ఎస్‌ను గెలిపించండి అని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే భగత్‌కుమార్

హాలియా, నవంబర్ 14 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి తనను గెలిపిస్తే నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని నాగార్జునసాగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. మంగళవారం అనుములలో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ.. 2020లో దురదృష్టవశాత్తు నాన్న, దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అకాల మరణంతో 2021 నాగార్జునసాగర్‌కు ఉప ఎన్నిక వచ్చినట్లు తెలిపారు. ఆ ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి ఆశీర్వదించి ప్రజాసేవ చేసేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత నాన్న ఆశయాన్ని గుర్తుంచుకొని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా శక్తివంచన లేకుండా పని చేసినట్లు తెలిపారు. ఉప ఎన్నిక సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రూ.200 కోట్లు ఇవ్వగా వాటితో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయని, మరో 40 శాతం పనులు త్వరలోనే పూర్తికానున్నాయన్నారు. ఈ రెండున్నరేండ్లలో నియోజకవర్గంలో విద్య, వైద్యం, ప్రజారోగ్యం, రోడ్లు, తాగు, సాగునీటి వసతులతోపాటు విద్యుత్ లోఓల్టేజీ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. జానారెడ్డి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, 16 ఏండ్లు మంత్రిగా పని చేసి నియోజకవర్గాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. 50 ఏండ్లలో జరుగని అభివృద్ధిని సీఎం కేసీఆర్ సహకారంతో రెండున్నరేండ్లలోనే చేసినట్లు చెప్పారు. గతంలో ఇంటర్మీడియట్‌కే పరిమితమైన హాలియాలో ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను తీసుకొచ్చినట్లు చెప్పారు. అలాగే 50 పడకల ఆస్పత్రి, మార్చురీ సౌకర్యం కల్పించామన్నారు. నాగార్జునసాగర్‌లో రూ.18 కోట్లతో కమలానెహ్రూ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా ఆధునీకరించినట్లు తెలిపారు. కేవలం 5 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా రూపొందించిన నెల్లికల్ లిఫ్ట్‌ను 24,886 ఎకరాలకు సాగునీరు అందించేలా రీ డిజైన్ చేయడం జరిగిందన్నారు. ఈ లిఫ్ట్ నిర్మాణం కోసం ఇప్పటికే రూ.684 కోట్లను ప్రభుత్వం విడుదల చేయగా పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. డీ-8, 9 కాల్వలకు సాగునీరు అందించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ పనులు పూర్తయ్యాయని, త్వరలోనే 7,163 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి మరో రూ.300 కోట్లు అవసరం కానున్న విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో మరోసారి కారు గుర్తుపై ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ ఫ్లోర్‌లీడర్ కె.కేశవరావు, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కడారి అంజయ్యయాదవ్, కట్టెబోయిన గురువయ్యయాదవ్, బొల్లేపల్లి శ్రీనివాస్‌రావు, ఎంపీపీలు సుమతీపురుషోత్తం, ఆంగోతు భగవాన్‌నాయక్, బొల్లం జయమ్మ, మంచుకంటి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీలు అబ్బిడి కృష్ణారెడ్డి, సూర్య బాషానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్లు మర్ల చంద్రారెడ్డి, జవ్వాజి వెంకటేశం, గుండెబోయిన కోటేశ్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ కర్ణ అనుషాశరత్‌రెడ్డి, వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, నాయకులు కేవీ రామారావు, కామర్ల జానయ్య, బాబురావునాయక్, కేతావత్ భిక్షానాయక్, పాశం గోపాల్‌రెడ్డి, రవినాయక్, పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, నరేందర్, గజ్జెల చెన్నారెడ్డి పాల్గొన్నారు.

